క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

మచిలీపట్నంటౌన్: స్థానిక రాజుపేటలోని ఆంధ్ర హాస్పటల్ ఆవరణలో ఈ నెల 11వ తేదీ ఉచిత మధుమేహ (డయాబెటీస్) వ్యాధి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మధుమేహ వైద్యనిపుణుడు బి.తేజనవీన్ రోగులకు వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ప్రతి నెలా రెండో మంగళవారం నిర్వహిస్తున్న మాదిరిగానే వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని ఉచిత ఈసీజీ, జీఆర్‌బీఎస్ పరీక్షలు చేస్తామని, రక్త పరీక్షలపై 50 శాతం రాయితీ ఇస్తారని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



ఉంగుటూరు: సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ మేనేజర్ జి.పద్మవల్లి తెలిపారు. తేలప్రోలు ఎస్‌బీఐ వద్ద పలువురు ఖాతాదారులకు సైబర్ మోసాలపై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిజిటల్ మోసాలు, సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కేవైసీ అప్‌డేట్, సీవీవీ, పిన్ నంబర్ కోసం బ్యాంకు సిబ్బంది ఎవరినీ అడగరని చెప్పారు. బ్యాంకు ఖాతాకు సంబంధించిన సమాచారాన్ని ఎవరితో పంచుకోకూడదన్నారు. ఒక వేళ మీరు ఎటువంటి లావాదేవీలు చేయకపోయినా లావాదేవీలు జరిగినట్లు అనుమానం వస్తే తక్షణమే బ్యాంకులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసోసియెట్ పి.శాంతికిరణ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రమంత్రి శ్రీనివాస్‌వర్మకు అభినందన



గుడివాడరూరల్: కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నర్సాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్‌వర్మను సోమవారం ఢిల్లీలోని ఆయన స్వగృహంలో గుడివాడకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు రామినేని వెంకటకృష్ణ సోమవారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామినేని మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేయడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నర్సాపురం ఎంపీ భూపతిరాజును కేంద్రమంత్రిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని రామినేని తెలిపారు.

వైభవంగా రాజగోపాలస్వామి శాంతి కల్యాణం



మండవల్లి: అల్లినగరం రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యాన ఈఓ దివ్యశ్రీ పర్యవేక్షణలో నారగాని నాగేశ్వరరావు దంపతులతో కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రాము, సాంబశివరావు, శివాజీ పాల్గొన్నారు.

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి



కంకిపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన దోషులను కఠినంగా శిక్షించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. కంకిపాడులోని సంఘ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన సంఘటనపై సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోగులమూడి రాజు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం ఎర్రపోతవరం లాకులు వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి గుర్తుతెలియని దండగులు అసభ్యంగా దూషిస్తూ లేఖ రాసి, చెప్పులు దండ వేయటాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీల ముసుగులో రాజ్యాంగ నిర్మాతనే అవమానిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి, మాలలను దూషిస్తూ లేఖ రాసిన నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి గంజి రాజ్‌కుమార్, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల అధ్యక్షులు ఆంటోని, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

చురుగ్గా ఉపాధి పనులు

- రూ.34.5 లక్షలతో 75 పనులు
- 19,894 మందికి ఉపాధి



నాగాయలంక మండలం టి.కొత్తపాలెం గ్రామంలో చెరువు పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

నాగాయలంక: మండలంలో ఉపాధి హామీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద నాగాయలంక మండలంలో 9,991 గృహాలకు సంబంధించి 19,894 మంది కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నామని పథకం ఏపీఓ టి.వి.ఎస్ ముత్యాలు చెప్పారు. ప్రస్తుతం మండలంలోని 22గ్రామ పంచాయతీల పరిధిలో రూ.34.5లక్షలు వ్యయంతో కల్పించిన 75 పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఆయన వివరించారు. గ్రామాల్లో లేకుండా దూర ప్రాంత పట్టణాల్లో ఉపాధి కూలీ జాబ్‌కార్డులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ప్రశ్నించగా అలాంటి వారికి గృహనిర్మాణాల కోసం జాబ్ కార్డులు ఇస్తారని ఏపీఓ వివరించారు. కార్డుకు వంద రోజులు పని కల్పించాల్సిన సందర్భంలో వారం రోజుల పనికి ఒక్కో కూలీ నుంచి వంద రూపాయలు చేస్తున్నారని, పనిలోకి రానివారికి హాజరు వేసి సంబంధిత నగదు క్షేత్ర సిబ్బంది దుర్వినియోగం చేస్తున్నారని, అక్రమాలపై ఉన్నతాధికారులకు చెబితే పనులు కల్పించబోమని బెదిరిస్తున్నారని పలువురు కూలీలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఏపీఓను అడగగా మా దృష్టికి ఏమీ రాలేదని, ఏ పంచాయతీలోనైనా ఇలాంటి సంఘటనలు ఉంటే విచారణ జరిపి ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్య తీసుకుంటామని వివరించారు. ఈ పథకం ద్వారా పనులు లేని పేదలకు మేలు జరుగుతుందన్నారు. మండలంలో పంట కాలువలు, చెరువుల తవ్వకం తదితర పనులు వేగంగా జరుగుతున్నాయి.



భావదేవరపల్లిలో సూచనలు చేస్తున్న ఏపీఓ టీవీఎస్ ముత్యాలు



నాగాయలంక మండలంలో..

కళాశాలల్లో ప్రవేశాల పెంపునకు కృషి

డీఐఈఓ సాల్మన్‌రాజు



ఉపాధ్యాయుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న సాల్మన్‌రాజు

పెడన: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని డీఐఈఓ (డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్) సాల్మన్‌రాజు కోరారు. స్థానిక బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో సోమవారం వృత్తి విద్య, కృష్ణాజిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పెడన, గూడూరు మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి చేయాల్సిన కృషిపై డీఈఓ తాహేరా సుల్తానా జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న వసతులపై సాల్మన్‌రాజు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. అందరు కలసి కట్టుగా విద్యార్థుల పెంపునకు పాటుపడాలని సాల్మన్‌రాజు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డీవైఈఓ చంద్రశేఖర్‌సింగ్, ఎంఈఓలు సుబ్రహ్మణ్యం, వైవి హరనాథ్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తిప్రదాత రాజరత్నం

గజల్ శ్రీనివాస్



రాజరత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గజల్ శ్రీనివాస్

ఘంటసాల: అన్నదానంలో పరమాత్ముడు ఉన్నాడని నమ్మిన వ్యక్తి రాజరత్నం మహిళలకు స్ఫూర్తిప్రదాతని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. ఘంటసాల గ్రామానికి చెందిన మూల్పూరి రాధాకృష్ణయ్య సతీమణి రాజరత్నం ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆయన ఆత్మీయ స్నేహితుడైన రాజరత్నం కుమారుడు ప్రవాస భారతీయుడు మూల్పూరి రత్నశేఖర్‌ను, వారి సోదరుడు సతీష్‌లను ఘంటసాల గ్రామంలోని వారి స్వగృహంలో సోమవారం పరామర్శించారు. రాజరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఘంటసాలలోని జలధీశ్వరస్వామి వారికి సుప్రభాతం అంకితం ఇవ్వడానికి వచ్చినప్పుడు భోజనం పెట్టారని, ఆమె భక్తి గీతాలు ఆలపించగా తన్మయత్వం చెందారన్నారు. ఆమె శివైక్యం చెందడం బాధాకరమన్నారు. రోజూ పది మందికి అన్నం పెట్టాలని, అన్నంమే శ్రీహరి అని, అన్నదానంలోనే పరమాత్మ ఉన్నాడని నమ్మిన వ్యక్తని కొనియాడారు. ఘంటసా ప్రాచీన పట్టణమని, ఎంతోమంది మహానీయులు, రాజులు, ఋషులు, బౌద్ధ బిక్షవులు నడయాడిన పుణ్యభూమిలో సుప్రభాతం చేయడం అదృష్టం అన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం



కోడూరు: స్థానిక కోట రాఘవయ్య (ఎస్‌కేఆర్) విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీ గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యాసంస్థల పర్యవేక్షణలో కొనసాగుతున్న రవితేజ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఈ హోమాన్ని జరిపారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ విద్యాసంస్థల గౌరవసలహాదారు కోట వెంకటసుబ్బారావు, పాఠశాల డైరెక్టర్ వల్లభనేని వీరవెంకట శివవరప్రసాద్ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి హోమ క్రతువును జరిపారు. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటూ పూజలు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వెంకటసుబ్బారావు, శివవరప్రసాద్ సూచించారు. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఇరుకు గదుల్లో పోస్టాఫీస్

మండవల్లి: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మండవల్లిలోని పోస్టాఫీస్ అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకు గదులతో ఉన్న ఈ భవనంలో సిబ్బందితోపాటు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సెంటర్‌లో సుమారు 20 ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీ తాగు చెరువు గట్టు పక్కన పోస్టాఫీస్‌కు 10 సెంట్ల స్థలం కేటాయించింది. అక్కడ ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణం ప్రారంభించలేదు. కిలోమీటరు దూరంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న పోస్టాఫీస్‌కు వెళ్లేందుకు వృద్ధులు, వికలాంగులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టాఫీస్‌కు కేటాయించిన స్థలంలో భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నసమారాధన



గుడివాడరూరల్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో శాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ సరపల్లి శ్రీనివాసరెడ్డి, అపర్ణల కుమార్తె మీనాక్షిప్రియారెడ్డి 8వ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, నవభారత్ ఖాదీస్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అవుట్ పోస్ట్ నిర్మాణం



తాడిగడప జంక్షన్‌లో నిర్మించిన ట్రాఫిక్ అవుట్ పోస్టు

పెనమలూరు: మండల పరిధిలో ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌కు కొత్తగా భవనం నిర్మించారు. కృష్ణా జిల్లా విడిపోయిన తరువాత పెనమలూరు మండలం విజయవాడ పోలీస్ కమిషనరేట్ నుంచి జిల్లా ఎస్పీ పరిధిలోకి ట్రాఫిక్ విభాగం మారింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు గన్నవరం సర్కిల్‌కు పరిధిలో ఉన్నారు. మండల పరిధిలో విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారి ఆటోనగర్ టెర్మినల్ నుంచి గోసాల వరకు విస్తరించి ఉండటంతో విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. దీనికి గాను దాదాపు 18 మంది ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పని చేస్తున్నారు. స్థానికంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ లేదు. దీంతో తాడిగడప జంక్షన్ వద్ద చిన్నపాటి ఇనప క్యాబిన్‌లో ట్రాఫిక్ అవుట్‌పోస్టులో సీఐ స్థాయి అధికారి, సిబ్బందితో మండల పరిధిలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు.

హోటల్ పుణ్యమా..

తాడిగడప జంక్షన్‌లో ఉన్న ట్రాఫిక్ అవుట్ పోస్ట్ కొత్తగా నిర్మించిన ఓ హోటల్‌కు అడ్డుగా ఉంది. దీంతో హోటల్ యజమాని ముందుకువచ్చి తాడిగడప జంక్షన్‌లో బందరు కాలువ కట్టపై వసతులతో ట్రాఫిక్ అవుట్ పోస్ట్ నిర్మిస్తానని ముందుకు వచ్చారు. ఇరిగేషన్ అనుమతితో బందరు కాలువ కట్టపై చిన్నపాటి ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌ను నిర్మించారు. హోటల్ ఎదురుగా ఉన్న పాత అవుట్ పోస్ట్ తొలగించారు. అయితే కొత్తగా నిర్మించిన అవుట్ పోస్ట్ పనులు చివరి దశకు చేరుకున్నాయి.

సమాజ శ్రేయస్సుకు కోదండ రామయ్య కృషి



కోదండరామయ్య కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న రామచంద్రమ్మ, అతిథులు

గన్నవరం: గన్నవరం పరిసర ప్రాంతాల్లో విద్యారంగం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వీకేఆర్ కళాశాల వ్యవస్థాపకుడు వేములపల్లి కోదండరామయ్య ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో సోమవారం వేములపల్లి కోదండరామయ్య 110వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోదండరామయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన మేనకోడలు మోటపర్తి రామచంద్రమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. తొలుత జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, కళాశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వెంకట్ మోటపర్తి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం రామచంద్రమ్మ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం జీవితమంతా పాటుపడిన గొప్ప మహోన్నతమైన వ్యక్తిగా కోదండరామయ్యను అభివర్ణించారు. బుద్దవరం, గుడివాడలో కళాశాలలు, నందివాడ, గన్నవరంలో జెడ్పీ హైస్కూల్స్ ఏర్పాటు ద్వారా వేలాది మంది విద్యార్థుల ఉన్నతికి ఆయన తోడ్పాడ్డారని చెప్పారు. ఐదున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన వీఆర్ కళాశాల విద్యార్థినని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నట్లు ఎమ్మెల్యే గద్దె పేర్కొన్నారు. పలువురు స్థానికులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌తో వేర్వేరు రంగాల్లో అవకాశాలు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఫార్మసీ విద్యార్థులు సిలబస్‌తో పాటు, కొన్ని రకాల వైద్య రంగంలో ఉపయోగపడే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్ నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని ఎడ్యుబోట్ అధినేత పాలడుగు శశాంక అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఫార్మాస్యుటిక్స్, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శశాంక మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు అవసరమైన సాఫ్ట్‌వేర్స్ గురించి విద్యార్థులకు తెలియచేశారు. ప్రతి విద్యార్థి సిలబస్‌తో పాటు, అదనపు కోర్సుల్లో శిక్షణ చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత మాట్లాడుతూ బి.ఫార్మసీ, ఫార్మ డి విద్యార్థులు హెల్త్ ఇన్ఫార్మెటిక్స్ రంగంలో దేశవిదేశాల్లో ఎక్కువ ఉపాధి అవకాశాలు, మెరుగైన జీతంతో భవిష్యత్తులో స్థిరపడుతున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో గంటా విజయ్‌కుమార్, డాక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు



అభయాంజనేయస్వామి ప్రత్యేక పూజల్లో ఉప్పాల రాము

బంటుమిల్లి: మండలంలోని చినతుమ్మిడి గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవ పూజల్లో పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉప్పాల రమేష్(రాము) పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం వార్షికోత్సవం సందర్భంగా ఉదయం విఘ్నేశ్వరపూజ, అఖండ దీపారాధన, స్వామి వార్కి ట్రస్టీ వెలివెల సత్యనారాయణ, మీనాక్షి దంపతులతోపాటు పలువురు విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు హనుమాన్‌చాలీసా పారాయణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, వైఎస్సార్ సీపీ నాయకులు బి.నాగార్జున, పి.శివ, రాంకీ, జీవీ రాజు, కె.వెంకటేశ్వరరావు, డి.సాంబశివరావు, మాజీ సర్పంచ్ పి.నరసింహారావు, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా 'సహాయ'



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

పెడన: పేద కుటుంబాలను పలు రకాల సేవలతో అండదండగా సహాయ ఫౌండేషన్ నిలుస్తోందని విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి మట్టా రాధాకృష్ణమూర్తి అన్నారు. సోమవారం స్థానికంగా సంస్థ కార్యాలయంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఫౌండేషన్ కొన్ని సంవత్సరాలుగా పేదలను ఆర్థిక, వస్తు రూపేణ ఆదుకుందన్నారు. వేసవిలో పేద విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, ప్రతిభ అవార్డ్స్ అందజేసి ప్రోత్సహిస్తోందన్నారు. వారికి సాంకేతిక పరిజ్ఞానం ఇవ్వడాన్ని ఆయన కొనియాడారు. ఇందులో భాగంగా సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌బాషా, ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాదు, సభ్యులు ఆర్. ప్రసాదు, కె.సాంబశివరావు, మహిళ విభాగం అధ్యక్షురాలు కె.వెంకటేశ్వరమ్మ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు సత్యనారాయణను సత్కరించారు.

చురుగ్గా వంతెన నిర్మాణ పనులు



యండపల్లి వద్ద వంతెన కాంక్రీట్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కృత్తివెన్ను: మండల పరిధిలోని యండపల్లి స్లోపు వద్ద బంటుమిల్లి ప్రధాన పంటకాలువపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సోమవారం జరిగిన ప్రధాన పిల్లర్ కాంక్రీట్ పనులను ఇరిగేషన్ డీఈఈ గణపతి ఏఈఈ రాజ్యలక్ష్మితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు చాలా వేగంగా చేస్తున్నారని పిల్లర్ నిర్మాణంతో దాదాపు 30% పనులు పూర్తవుతాయన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రెండు గ్రామాలతో పాటు సుమారు 3 వేల ఎకరాల్లో పంట ఉత్పత్తుల రవాణాకు ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతుందన్న ఆలోచనతో గ్రామస్థుల కోరక మేరకు నాటి ఎంపీ నిధులు మంజూరు చేయించారు. వంతెన పనులు వేగంగా సాగడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నూరుశాతం రుణ వసూళ్లు

- కమ్మవారిపాలెం పీఏసీఎస్‌లో..
- సంఘం సీఈవో రామాంజనేయులు



నూరుశాతం రుణవసూళ్ల ధ్రువీకరణపత్రాన్ని మేనేజర్‌కు అందజేసిన సీఈఓ

నాగాయలంక: కేడీసీసీ బ్యాంకు నాగాయలంక బ్రాంచి పరిధిలోని పెదకమ్మవారిపాలెం పీఏసీఎస్‌లో 2023–24 సంవత్సరానికి నూరుశాతం రుణాలు వసూలు సాధించినట్లు సంఘం సీఈవో కె.వి.రామాంజనేయులు సోమవారం తెలిపారు. సొసైటీలో 622 మంది రైతుల నుంచి స్వల్పకాలిక రుణాలు రూ.331.97లక్షలు, దీర్ఘకాలిక రుణాలు రూ.272.83 లక్షలు, ఇతరత్రా రూ.50 లక్షలు మొత్తం రూ.654.80లక్షలు నూరుశాతం వసూలు జూన్10 నాటికి పూర్తిచేశారు. 14 ఏళ్లుగా క్రమం తప్పకుండా ఏటా నూరు శాతం వసూళ్లు కొనసాగుతోందని సీఈఓ పేర్కొన్నారు. ఈ మేరకు పత్రాలను ఆయన, సిబ్బంది, కేడీసీసీ చీఫ్ మేనేజర్ చింతలపూడి మధుబాబుకు అందజేశారు. రుణ వసూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించిన సిబ్బందిని ఈ సందర్భంగా కేడీసీసీ నాగాయలంక బ్రాంచిలో జరిగిన కార్యక్రమంలో మేనేజర్ అభినందించారు. రుణ వసూళ్లలో నోడల్ అధికారి జీఎస్ ప్రకాశరావు, సూపర్‌వైజర్ రెహామున్నీసా, గుమస్తా యలవర్తి వెంకటేశ్వరరావు, ఇతర సిబ్బంది మిరియాల వేణు, ఎం.పార్వతీరావు పాల్గొన్నారు.

నోరూరిస్తున్న నేరేడు కాయలు



రహదారి వెంబడి నల్లని రంగులో ఉన్న నేరేడు కాయలు నోరూరిస్తున్నాయి. సోమవారం స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద నేరేడు కాయలను తోపుడు బండిలో అమ్ముతున్నారు. ఈ సీజన్‌లో వచ్చే నేరేడు కాయలను ఎంతో మంది ఇష్టంగా తింటూ ఉంటారు. కేజీ నేరేడు కాయలు రూ.250 నుంచి రూ.300 వరకు అమ్ముతుండటంతో ప్రజలు అధిక రేటును చూసి వామ్మో అంత రేటా అని ఆశ్చర్యపోతున్నారు. – పామర్రు

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు



సర్వేలో పాల్గొన్న ఐఈఆర్‌పీలు

మొవ్వ: సమగ్ర శిక్ష అభియాన్ అధికారుల ఆదేశాల మేరకు 2024–25 విద్యా సంవత్సరానికి గాను ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు కోసం చేసిన డోర్ టు డోర్ సర్వేలో 13 మందిని గుర్తించినట్లు ఐఈఆర్‌పీలు తెలిపారు. గత నెల ఒకటో తేదీ నుంచి జరిగిన ఈ సర్వే ద్వారా నర్సన్నపాలెంలో–2, కూచిపూడిలో –3, మల్లికార్జునపురంలో–3, మొవ్వలో–2, వేములమడ, మండపాలెం, పెదముత్తేవి గ్రామాల్లో ఒక్కొక్క ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించినట్లు ఐఈఆర్‌పీ వాణి శ్రీ, సాయి శ్రీలు తెలిపారు.